పారిశుధ్యంపై పట్టింపేదీ?

- నగరంలోని పలు డివిజన్లలో రోడ్ల పక్కన పేరుకుపోయిన చెత్త
- అధ్వానంగా డ్రెయినేజీలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



పెద్దబజార్ జోన్‌కార్యాలయం సమీపంలోని రోడ్డు పక్కన ఉన్న చెత్త.. మురుగుకాలువల్లో వ్యర్థాలు

నిజామాబాద్‌నాగారం: నగరంలోని జోన్–3 ప్రాంతంలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. రోడ్ల పక్కనే చెత్తాచెదారం పేరుకుపోవడంతో పరిసరాలు అధ్వానంగా మారాయి. దీంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్రెయినేజీల్లో సైతం ప్లాస్టిక్ కవర్లు, చెత్తాచెదారం పేరుకుపోతున్నాయి. అయినా మున్సిపల్ కార్మికులు సకాలంలో తొలగించకపోవడంతో మురుగునీటి పారకం నిలిచిపోతుంది. పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పర్యవేక్షణ అంతంతే..

నగరంలోని జోన్–3(పెద్దబజార్) ప్రాంతంలో సుమారు 10 డివిజన్లు ఉన్నాయి. ఇందులో పెద్దబజార్‌లోని జోన్ కార్యాలయం నుంచి ఖిల్లా చౌరస్తా వైపు వెళ్లే ప్రధాన రహదారి వెంబడి రోడ్డుపైనే చెత్తాచెదారం వేస్తున్నారు. మురుగుకాలువల్లోనూ చెత్తాచెదారం, ప్లాస్టిక్‌కవర్లు పేరుకుపోతున్నాయి. జోన్ స్థాయి అధికారులు ఈవైపు నుంచి రాకపోకలు సాగిస్తున్నా.. పారిశుధ్యంపై పట్టనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. అసలే వర్షాకాలం కావడంతో పరిసరాల అపరిశుభ్రత, దోమల బెడదతో రోగాల బారిన పడే అవకాశాలు ఉన్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో జోన్‌కు ఒక్కరే అధికారి ఉండడంతో సక్రమంగా జరిగేది. ఇద్దరు ఉండడంతో పర్యవేక్షణ విషయంలో తలోదారి అన్నట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నగరంలో పారిశుధ్యంపై దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతినిత్యం చెత్త తొలగించాలి..

నగరంలో చెత్తను తొలగించడానికి శానిటేషన్ సిబ్బంది సక్రమంగా రావడం లేదు. అందుకే ప్రజలు రోడ్డుపైనే చెత్త వేస్తున్నారు. మురుగుకాలువల్లో ఉన్న వ్యర్థాలను తొలగించడం లేదు. అధికారులు స్పందించి నిత్యం చెత్తను తొలగించేలా చర్యలు తీసుకోవాలి.

–నరేందర్, స్థానికుడు

క్లుప్తంగా

పనులను వేగంగా పూర్తిచేయాలి



నిజామాబాద్‌నాగారం: ప్రారంభించిన పనులను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ త్వరితగతిన పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తేవాలని మేయర్ దండునీతూకిరణ్ అన్నారు. నగరంలోని 26, 46, 48 డివిజన్ల పరిధిలో గురువారం కల్వర్టు పనులను మేయర్ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ... నగరంలో ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. కార్పొరేటర్లు వనిత, అక్బర్ హుస్సేన్, నాయకులు అరుణ్, రాము ఇంజినీర్ సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో ఆటల పోటీలు



ఖలీల్‌వాడి: నగరంలోని నిజామాబాద్–1 ఆర్టీసీ డిపోలో ఉద్యోగులు, వారి పిల్లలకు గురువారం ఆటల పోటీలు, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. వ్యాస రచన పోటీలు క్యాటగిరి–1లో మొదటి బహుమతి ఎండీ.అఫ్సానాజ్, కేటగిరి–2లో మొదటి బహుమతి పల్లవి ఎంపికైనట్లు డిప్యూటీ ఆర్‌ఎం సరస్వతి విజేతలకు బహుమతులు ప్రదనం చేశారు. డిపో మేనేజర్ ఆనంద్, సత్యనారాయణ, శ్రవణ్, శివ, రాజవ్వ పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



మోపాల్(నిజామాబాద్‌రూరల్): సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా మోసపోతే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారమివ్వాలని ఏఎస్సై రమేష్‌బాబు సూచించారు. మండలంలోని ముదక్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం 'సైబర్ సురక్షత–జాతీయ భద్రత' అనే అంశంపై ఆశావర్కర్లు, వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఎవరైనా మోసపోతే డయల్ 100కు కూడా ఫోన్ చేయవచ్చన్నారు. వైద్యారోగ్యశాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలి



సిరికొండ: విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ట్రాన్స్‌కో డిచ్‌పల్లి డీఈ ఉత్తమ్‌జాడే సిబ్బందిని ఆదేశించారు. తూంపల్లి 33/11 కేవీ సబ్ స్టేషన్‌ను ఆయన గురువారం తనిఖీ చేసి, గడ్కోల్ సెక్షన్ కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. డీఈ మాట్లాడుతూ.. మరమ్మతులు చేస్తున్నప్పుడు సరఫరాలో అంతరాయం గురించి వినియోగదారులకు ముందస్తు సమాచారం ఇవ్వాలన్నారు. వ్యవసాయ రంగానికి సంబంధించిన నూతన కనెక్షన్లను సత్వరమే పూర్తి చేయాలని తెలిపారు. ఏఈ శివకుమార్, సబ్ ఇంజనీర్ సుధాకర్, లైన్ ఇన్‌స్పెక్టర్లు రాములు, లైన్‌మేన్లు, జేఎల్‌ఎంలు పాల్గొన్నారు.

గుడ్లు, గ్యాస్ ప్రభుత్వమే ఇవ్వాలి

సిరికొండ: పాఠశాలల్లో మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు నిత్యావసర సరుకులను, గుడ్లను, గ్యాస్ సిలిండర్లను ప్రభుత్వమే సరఫరా చేయాలని నిర్వాహకులు డిమాండ్ చేశారు. బకాయిలు పేరుకుపోయినందున భోజనంలో గుడ్లు, అల్పాహారం, రాగి జావ పెట్టలేమన్నారు. ఈమేరకు గురువారం ఎంఈవో కార్యాలయంలో సిబ్బందికి వారు వినతి పత్రం అందజేశారు. ఎండీఎం వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చక్రపాణి, ప్రమీల, లక్ష్మణ్, స్వప్న, గంగామణి, రాధ,గంగవ్వ, లక్ష్మీ ఉన్నారు.

డి శ్రీనివాస్‌కు సంతాపం



నిజామాబాద్‌నాగారం: మాజీ మంత్రి, మాజీ పీసీసీ అధ్యక్షుడు దివంగత డి.శ్రీనివాస్‌కు గురువారం నిజామాబాద్ వెండి, బంగారు వర్తకుల సంఘం ఆధ్వర్యంలో సంతాపం ప్రకటించారు. ఈసందర్భంగా డీఎస్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించి మౌనం పాటించారు. సంఘ ప్రతినిధులు లక్ష్మీకాంత్, పసుల రాజ్‌కుమార్, చిలుక ప్రకాష్ ఉన్నారు.

మాజీ ఎంపీపీకి సన్మానం

జక్రాన్‌పల్లి: జక్రాన్‌పల్లి ఎంపీపీ దీకొండ హరిత శ్రీనివాస్ పదవీకాలం ముగియడంతో గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో వారిని సన్మానించారు. కొలిప్యాక్ జెడ్పీహెచ్ఎస్‌లో దీకొండ హరిత శ్రీనివాస్ దంపతులను సత్కరించారు. అధికారులు శిరిషా, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేటి చిత్రం..


శ్రీనగర్ కాలనీలో అధ్వానంగా మారిన రహదారి

రోడ్డంతా గుంతలమయం

నగరంలోని శ్రీనగర్ కాలనీలో రోడ్డు మొత్తం గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలకు గుంతలలో నీరు నిల్వఉండటంతో గుంతలు తెలియక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

అల్లూరిని ఆదర్శంగా తీసుకోవాలి



అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి, నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్.. మేయర్ నీతూకిరణ్

- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ
- ఘనంగా మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి

సుభాష్‌నగర్: బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజును ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. గురువారం అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా నగరంలోని కోటగల్లిలోగల ఆయన విగ్రహానికి ధన్‌పాల్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భారత స్వాతంత్య్ర సంగ్రామంలో అల్లూరి జరిపిన సాయుధ పోరాటం ప్రత్యేక అధ్యాయమన్నారు. విగ్రహ కమిటీ అధ్యక్షుడు అడ్వకేట్ సుదర్శన్, నాయకులు నాగోళ్ల లక్ష్మీనారాయణ, పల్నాటి కార్తీక్, హరీష్‌రెడ్డి, ఆనంద్, పవన్ ముందాడ, కృష్ణ, మురళీ, సతీష్ పాల్గొన్నారు.

నిజామాబాద్‌నాగారం: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజును నేటి యువత స్ఫూర్తిగా తీసుకొని ముందుకెళ్లాలని మేయర్ దండు నీతూకిరణ్ అన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా కోటగల్లిలోని అల్లూరి విగ్రహానికి ఆమె పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్పొరేటర్ ధర్మపురి , నాయకులు సుదర్శన్‌రావు, రాజేశ్వర్, కృష్ణ తదితరులున్నారు.


గడ్కోల్ గ్రామంలో..

సిరికొండ: మండలంలోని గడ్కోల్ గ్రామంలో నవయువ యూత్ ఆధ్వర్యంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. అల్లూరి విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులు అలర్పించారు. యూత్ అధ్యక్షుడు శంకర్, భాస్కర్, ఫారూఖ్, నరేష్, మోహన్, రఘురాజ్, నరేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్.. విద్యార్థి నాయకుల అరెస్టు



నిజామాబాద్‌అర్బన్/జక్రాన్‌పల్లి/డిచ్‌పల్లి/సిరికొండ: జిల్లావ్యాప్తంగా గురువారం విద్యార్థి సంఘాల నాయకులు విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చారు. నీట్ పరీక్షపత్రాల లీకేజీలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, వారు బంద్ చేపట్టారు. ఈసందర్భంగా ప్రయివేటు పాఠశాలలు ముందుగానే బంద్‌ను పాటించాయి. కానీ నగరంతోపాటు పలు మండలాల్లో కొన్ని ప్రభుత్వ పాఠశాలలు బంద్ పాటించలేవు. దీంతో వాటిని బంద్ చేయించేందుకు విద్యార్థి సంఘాల నాయకులు యత్నించారు. వెంటనే వారిని పోలీసులు అడ్డుకొని, పోలీస్‌స్టేషన్లకు తరలించారు.

అక్రమ అరెస్టులను ఖండించండి..

తెలంగాణ యూనివర్సిటీతో పాటు నిజామాబాద్ జిల్లావ్యాప్తంగా ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన విద్యాసంస్థల బంద్‌లో పాల్గొన్న విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు అక్రమ అరెస్టులు చేయడాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలని పీడీఎస్‌యూ మండల అధ్యక్ష, కార్యదర్శులు శివకుమార్, రాజేందర్‌లు పేర్కొన్నారు. విద్యా సంస్థల బంద్‌లో పాల్గొన్న పీడీఎస్‌యూ నాయకులను అక్రమ అరెస్ట్ చేయడం దారుణమని ఏఐకెఎంఎస్ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి కారల్‌మార్క్స్ అన్నారు.

అంగన్‌వాడీ టీచర్‌పై విచారణ

మోపాల్: మండలంలోని వెంకట్రాం నాయక్ తండా అంగన్‌వాడీ టీచర్ సునీతపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వరూప గురువారం విచారణ చేపట్టారు. అంగన్‌వాడీలో పౌష్టికాహారం పక్కదారి పట్టించడం , నిధుల దుర్వినియోగంపై గ్రామస్తులు ఫిర్యాదుచేశారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సూపర్‌వైజర్ స్వరూప విచారణ చేపట్టి, రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. సునీతకు మెమో జారీ చేసి, రెండ్రోజుల్లో వివరణ ఇవ్వాలని సూచించారు. ఆమె వివరణ ఆధారంగా నివేదికను జిల్లాస్థాయి అధికారులకు నివేదిస్తానని సూపర్‌వైజర్ స్వరూప తెలిపారు.

దొడ్డి కొమురయ్యకు ఘన నివాళి



నగరంలో నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు.. మోపాల్ మండలంలో..

ఖలీల్‌వాడి/నిజామాబాద్‌అర్బన్/ధర్పల్లి/సిరికొండ: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, తొలి అమరుడైన దొడ్డి కొమురయ్యకు వామపక్ష పార్టీల నాయకులు ఘన నివాళులు అర్పించారు. నిజామాబాద్ అర్బన్, రూరల్ నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో గురువారం కొమురయ్య వర్ధంతిని సీపీఎం, ఎస్ఎఫ్ఐ, ఏఐకేఎంఎస్, సీపీఐఎంఎల్ మాస్‌లైన్ నాయకులు వేర్వేరుగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా పార్టీల నాయకులు కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ.. కొమురయ్య పోరాటాలను కొనియాడారు. పెద్ది వెంకట్ రాములు, నూర్జహాన్, సుజాత, మహేష్, గణేష్, మహేష్, బాబురావు, ఆజాద్, వరదరాజ్, సంతోష్, నిమ్మల భూమేష్, వెంకట్, గంగాధర్, సంజీవ్, గంగయ్య, పద్మ, కృష్ణ, రామకృష్ణ, కిషోర్, అనీస్, లింబాద్రి, రాములు, ఆశన్న, పెద్ద రాజాగౌడ్, మార్క్స్ పాల్గొన్నారు.


గడ్కోల్‌లో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో..


ధర్పల్లిలో ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో..

పదెకరాలలోపు వారికే రైతుభరోసా ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న అధికారి శ్రీరాం

నిజామాబాద్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అందించే రైతుభరోసా పథకాన్ని పదెకరాలలోపు రైతులకి ఇవ్వాలని రూరల్ మండల అన్నదాతలు అన్నారు. మాధవనగర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ పరిధిలో గురువారం ప్రత్యేక మహాజన సభ నిర్వహించి రైతుభరోసాపై అన్నదాతల అభిప్రాయాలను అధికారులు సేకరించారు. ఇన్‌కమ్ టాక్స్ చెల్లించే రైతులను పరిగణలోకి తీసుకోకుండా అందరూ రైతులకు రైతుబంధు ఇవ్వాలని, వడ్లకు మద్దతు ధర రూ.3100 చెల్లిస్తే రైతుబంధు అవసరంలేదని చైర్మన్ ప్రతిపాదించగా రైతులందరూ మద్దతు తెలియజేశారు. సాగు చేసే రైతులందరికీ రైతుబంధు వర్తింపచేయాలని రైతులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఏవో జాదవ్ హిరా, పీఏసీఎస్ చైర్మన్ దాసరి నాగేశ్వర్‌రావు, ఉపాధ్యక్షుడు పోతరెడ్డి, సీఈవో వంశీ కృష్ణ, ఏఈవో స్వాతిలత పాల్గొన్నారు.

మండల ప్రత్యేకాధికారుల బాధ్యతల స్వీకరణ



జక్రాన్‌పల్లిలో బాధ్యతలు స్వీకరిస్తున్న తిరుమల ప్రసాద్.. మోపాల్‌లో సురేశ్‌కుమార్

ధర్పల్లి/జక్రాన్‌పల్లి/డిచ్‌పల్లి/మోపాల్/నిజామాబాద్ రూరల్: నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పరిషత్ సభ్యుల పదవీకాలం ముగియడంతో ఇటీవల కలెక్టర్ ఆయా మండలాలకు ప్రత్యేక అధికారులను నియమించారు. గురువారం ఆయా మండలాల్లో ప్రత్యేక అధికారులు బాధ్యతలు స్వీకరించారు. ధర్పల్లిలో మండల ప్రజాపరిషత్ ప్రత్యేక అధికారిగా శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆయన డివిజనల్ పంచాయతీ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. అలాగే జక్రాన్‌పల్లి ప్రత్యేక అధికారిగా జిల్లా వ్యవసాయ డిప్యూటీ డైరెక్టర్ తిరుమల ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. డిచ్‌పల్లి మండల ప్రత్యేకాధికారిగా జిల్లా కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్ పి.యోహాన్ బాధ్యతలు స్వీకరించారు. మోపాల్ మండల ప్రత్యేకాధికారిగా జిల్లా పరిశ్రమలశాఖ జీఎం సురేష్‌కుమార్ మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. నిజామాబాద్ రూరల్ మండల ప్రత్యేక అధికారిగా మెప్మా పీడీ రాజేందర్ బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు ప్రత్యేకాధికారులకు స్థానిక అధికారులు, సిబ్బంది ఘనంగా స్వాగతం పలికి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అధికారులతో వారు ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, మండలాల్లో నెలకొన్న సమస్యలు, అభివృద్ధి పనులు తదితర వాటిపై వివరాలను తెలుసుకున్నారు. అధికారులకు తగిన సలహాలు, సూచనలు చేశారు.


డిచ్‌పల్లిలో యోహాన్



రూరల్‌లో అధికారికి స్వాగతం పలుకుతున్న అధికారులు.. ధర్పల్లిలో..

ఆధ్యాత్మికం

మానవ జన్మ లభించడం అదృష్టం



నిజామాబాద్‌అర్బన్: మానవ జన్మ లభించడం మన అదృష్టమని ప్రవచకులు ఫణతుల మేఘ రాజ్ శర్మ అన్నారు. నగరంలోని ఉమామహేశ్వర ఆలయంలో శ్రీమద్భాగవత సప్తాహ ప్రవచనాలు గురువారం రెండోరోజు కొనసాగాయి. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవజన్మ సార్థకం చేసుకోవడానికి ఆధ్యాత్మిక చింతనను మించిన మార్గం మరొకటి లేదన్నారు. అన్ని వేదాలకు శాస్త్రాలకు మూలమైనటువంటిది అష్టదశ పురాణాల్లో అత్యంత శ్రేష్టమైనది శ్రీమత్ భాగవతం అని అన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సిబ్బంది భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్స్‌డ్	200
	(కిలోకు)	లైవ్	180
స్కిన్‌లెస్	240	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	72,100	వెండి (కిలో)	93,000
22 క్యారెట్స్	67,432	– నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	40	60	గాజరుగడ్డ	30	50
బెండకాయ	40	60	పచ్చిమిర్చి	50	80
జీరకాయ	50	70	దోసకాయ	20	40
దొండకాయ	15	30	ఆలుగడ్డ	30	50
జిర్నిసుకాయ	100	130	గోబిగడ్డ	20	40
కాకరకాయ	50	75	గోబిపువ్వు	30	50
వంకాయ	20	40	బీట్‌రూట్	30	60
పాలకూర	30	50	కరివేపాకు	40	60
మెంతికూర	50	75	చామగడ్డ	40	60
కొత్తిమీర	30	50	గోరుచిక్కుడు	50	75
పుదీనా	50	75	చిక్కుడుకాయ	60	90
క్యాప్సికం	60	80			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్–1	కల్కి–2898 ఏడీ(తెలుగు)–12.00. 3.30,7.00,10.35
స్క్రీన్–2	కల్కి–2898 ఏడీ(తెలుగు) –1.20
స్క్రీన్–3	కల్కి–2898 ఏడీ(తెలుగు)–10.30 కల్కి–2898ఏడీ(3డీతెలుగు) –4.45, 9.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్–1	కల్కి–2898 ఏడీ(3డీ తెలుగు)– 11.00,2.45,6.30, 10.15
స్క్రీన్–2	డెస్పి ఎబుల్ మీ4(3డీ–తెలుగు) –11.40,2.00,4.20, 6.40 డెస్పి ఎబుల్ మీ4(3డీ- ఇంగ్లీష్)- 9.00
స్క్రీన్–3	ఎం.ఎస్.ధోని(హిందీ)–11.30,10.45 కల్కి–2898 ఏడీ(తెలుగు)–3.15,7.00
స్క్రీన్ -4	కిల్(హిందీ)–11.15,1.45, 8.00, 10.30 - ఎం.ఎస్.ధోని(హిందీ)- 4.15
దేవి	కల్కి–2898 ఏడీ (తెలుగు)
నటరాజ్	కల్కి–2898 ఏడీ (తెలుగు)
విజయ్	కల్కి–2898 ఏడీ(తెలుగు)

సంక్షిప్తం

భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

ఇందల్వాయి: మండలంలోని గౌరారం గ్రామ పరిధిలోని లింగాపూర్ గ్రామంలో 180 సర్వే నంబరులో తనకున్న 30 గుంటల భూమిని కబ్జా చేసేందుకు యత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని లింగాపూర్ గ్రామానికి చెందిన మూడెడ్ల తులసమ్మ తహశీల్దార్ కార్యాలయంతో పాటు స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేసింది. ఎస్సై మనోజ్ వివాదస్పద భూమిని పరిశీలించగా, తహసీల్దార్ వెంకట్‌రావు రికార్డులను పరిశీలించి అర్హులకు న్యాయం చేస్తామని తెలిపారు. శివ, గోపాల్, ఎర్ర రాజేందర్, రఘు, సంతోష్ శ్రీనివాస్ ఉన్నారు.

హైకోర్టు మాజీ జస్టిస్‌ను కలిసిన న్యాయవాదులు

ఖలీల్‌వాడి: నగరానికి విచ్చేసిన హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ప్రకాష్ రావును గురువారం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్‌గౌడ్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిశారు. పలు అంశాలపై వారితో చర్చించారు. న్యాయవాదులు కృపాకర్‌రెడ్డి, రాజ్‌కుమార్ సుబేదార్, రవీందర్, మాణిక్‌రాజు, వెంకటరమణగౌడ్, శ్రీకాంత్, ఉదయ్, జైపాల్ ఉన్నారు.

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు సన్మానం

డిచ్‌పల్లి: మండలంలోని సుద్దులం జెడ్పీహెచ్ఎస్‌లో బదిలీపై వెళ్తున్న ముగ్గురు ఉపాధ్యాయులను గురువారం గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. అనంతరం సదరు ఉపాధ్యాయులు రూ.5వేలు చొప్పున పాఠశాలకు విరాళం అందజేశారు. హెచ్ఎం గంగారాం, మాజీ సర్పంచ్ వెంకటేష్, నాయకులు సురేందర్‌రెడ్డి, వీడీసీ సభ్యులు అమ్మ ఆదర్శ పాఠశాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

నిజామాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల టాపర్ విద్యార్థి మృణాళినికి గురువారం గోర్తి ఈశ్వర ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉషా బాలా పవన్ కుమార్ ఆర్థిక సహకారంతో ట్రస్టు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు తిరుపతి రెడ్డి రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. హెచ్ఎం సాయిరెడ్డి, ఉపాధ్యాయులు, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక

సిరికొండ/జక్రాన్‌పల్లి: బాసర ట్రిపుల్ ఐటీకి సిరికొండ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని అక్షర, ఆదర్శ పాఠశాల విద్యార్థులు గుణకరణ్, హర్షిణి, జక్రాన్‌పల్లి మండలం పడకల్ గ్రామానికి చెందిన గంగి శంకర్ ఎంపికైనట్లు ఆయా పాఠశాలల హెచ్ఎంలు తెలిపారు. ఈసందర్భంగా వారిని గురువారం అభినందించారు. అలాగే పలు సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులను సన్మానించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మోపాల్: మండలంలోని కంజర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు సత్యనారాయణ కుమార్తె ఇటీవల మృతిచెందింది. బాధిత కుటుంబాన్ని గురువారం రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పరామర్శించారు. బాజిరెడ్డి జగన్, శ్రీనివాస్‌రావు, ముత్యంరెడ్డి తదితరులు ఉన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 20764
90102 86628 (నిజామాబాద్)
94920 10949 (బోధన్, బాన్సువాడ)
95055 08389 (ఆర్మూర్)
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
నిజామాబాద్ అర్బన్ & రూరల్ రాంనాథ్ : 7997958181
ఆర్మూర్ శివ : 9848956776
బాల్కొండ ప్రశాంత్ : 8919850800
బోధన్ కృష్ణ : 7997958178
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899